క్లుప్తంగా

అభివృద్ధికి వనరులు గుర్తించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామ పంచాయతీల అభివృద్ధికి స్థానిక వనరులను గుర్తించి ప్రణాళికలు రూపొందించాలని ఈఓపీఆర్డీ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండ్రోజుల పాటు నిర్వహించిన పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ శుక్రవారంతో ముగిసింది. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సాగాలన్నారు. ఎంపీడీఓ వీవీ సాయిబాబు, ఏఓ చలమయ్య, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు చర్యలు



జాతీయ సేవా పథకం కార్యక్రమాలను వివరిస్తున్న డాక్టర్ సువర్ణలత

రంగంపేట: వడిశలేరులో బాపట్ల ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు శుక్రవారం జాతీయ సేవా పథకం కార్యక్రమాలను ప్రారంభించారు. డాక్టర్లు సువర్ణలత, సీహెచ్‌సంధ్యారాణి, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు ఎం.నందకిశోర్, అచ్యుతరాజు మాట్లాడుతూ గ్రామంలో ఏడు రోజులపాటు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. స్వచ్ఛ భారత్, వైద్య శిబిరాలు, విద్యార్థులను ఉత్తేజ పరచడం, కలుపు మొక్కలు, ఎలుకల నివారణపై సదస్సు, వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పోతుల బులివీర్రాజు, నాయకులు అళ్ల గోవిందు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు జక్కంపూడి రాజశ్రీ పరామర్శ



రాజమహేంద్రవరంలో బాధితుడిని పరామర్శిస్తున్న జక్కంపూడి రాజశ్రీ

మధురపూడి: వివిధ ప్రమాదాలు, అనారోగ్య ఇబ్బందులతో బాధపడుతూ రాజమహేంద్రవరంలోని వివిధ హాస్పటళ్లల్లో చికిత్స పొందుతున్న వారిని, ఇంటి వద్ద వైద్యం చికిత్స పొందుతున్న వారిని శుక్రవారం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి రాజశ్రీ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కోరుకొండ మండం బుచ్చెంపేట గ్రామానికి చెందిన గంగాధర్ మోటార్ సైకిల్‌తో డివైడర్‌ను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. బొల్లినేని హాస్పటల్లో చికిత్స పొందుతున్న అతడిని రాజశ్రీ పరామర్శించారు. గుమ్ములూరుకు చెందిన చిన్న వెంకన్న ప్రమాదంలో గాయపడి రాజమహేంద్రవరం ప్రైవేటు హాస్పటల్లో చికిత్స పొందుతున్నారు. కణుపూరు గ్రామానికి చెందిన శ్రీరామచంద్రమూర్తి గుండె సంబంధిత వ్యాధితో ఆస్పత్రిలో ఉన్నారు. వారిద్దరి ఆరోగ్య పరిస్థితిని రాజశ్రీ తెలుసుకున్నారు.

కులగణన సర్వే ప్రారంభం



పందలపాకలో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

బిక్కవోలు: మండలంలో కులగణన సర్వే శుక్రవారం ప్రారంభమైంది. వలంటీర్లు తమ పరిధిలోని ప్రజల వివరాలు సేకరించారు. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంది. మండలంలోని 21 సచివాలయాల పరిధిలో 447 మంది వలంటీర్లు ఈ సర్వే చేస్తున్నారు. 1,478 కుటుంబాల సర్వే చేసినట్లు తహసీల్దార్ పోసిబాబు తెలిపారు.

23న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

అనపర్తి: దుప్పలపూడి విద్యుత్ డివిజన్ కార్యాలయంలో 23న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం రూరల్ ఈఈ దాట్ల శ్రీధర్‌వర్మ అన్నారు. ఫోరం చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.సత్యనారాయణ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరుగుతుందని, వినియోగదారులు పాల్గొని విద్యుత్ సమస్యలు, నిర్వహణపై సూచనలు అందజేయాలని కోరారు. అలాగే 23న ఉదయం స్థానిక జీబీఆర్ కళాశాలలో నిర్వహించే కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు.

సస్యరక్షణతో సుసేద్యం

- తెగుళ్ల నివారణకు ముందస్తు జాగ్రత్తలు
- అనపర్తి నియోజకవర్గంలో 44,821 ఎకరాల్లో సాగు



టీవీఆర్ మణిదీప్, మండల వ్యవసాయాధికారి, పెదపూడి



పెదపూడిలో వరి పొలంలో మందు పిచికారీ చేస్తున్న రైతు

పెదపూడి: రైతుల ఇంట సిరుల పంట పండాలంటే సస్యరక్షణ ముఖ్యం.. దీనికి ముందస్తు జాగ్రత్తలు అవసరం.. అప్పుడే సేద్యం ఆశించిన దిగుబడులతో పుడమి పుత్రులకు లాభాలు తెచ్చిపెడుతోంది. అనపర్తి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఈ రబీలో 44,821 ఎకరాల్లో వరి సాగుకు రైతులు సన్నద్ధం అయ్యారు. అనపర్తి మండలంలో 9 వేలు, పెదపూడిలో 18 వేలు, రంగంపేటలో 2,100, బిక్కవోలు మండలంలో 15,741 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈ రబీలో వరి పంటను ఆశించే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులు తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉందని పెదపూడి మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ సూచించారు. సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు సాధ్యమని అన్నారు. పంటలను ఆశించే తెగుళ్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆయన వివరించారు. అవి ఆయన మాటల్లోనే..

ఆకుమచ్చ తెగులు

గొంగలి పురుగు వరి ఆకు ముడతలో ఉండి పత్ర హరితాన్ని తినేయడంతో ఆకులు తెల్లబడతాయి. పంట పిలక దశలో చేనుకు అడ్డంగా తాడుతో రెండు మూడో సార్లు లాగితే పురుగులు కిందపడతాయి. వీటి నివారణకు క్లోరిఫైరిఫాస్ 2.5 మిల్లీలీటర్ల మందును లీటరు నీటికి కలిపి ఎకరానికి 200 లీటర్లు పిచికారీ చేయాలి.

సుడిదోమతో నష్టాలు

వరి పంట అంకుర దశ నుంచి చిరుపొట్ట దశలో ఉన్నప్పుడు సుడిదోమ ఎక్కువగా ఆశించే అవకాశం ఉంది. గోధుమ వర్ణపు దోమలు దుబ్బుల అడుగున నీటిమట్టంపై ఉండి మొక్క రసాన్ని పీల్చుతాయి. దీనివల్ల పైరు సుడులు తిరిగి ఎండిపోతుంది. వరి నాట్లు వేసేటప్పుడే ప్రతి రెండు మీటర్ల పొడవుకు 20 సెంటీ మీటర్ల వెడల్పుతో బాటలు వదలాలి. పంటలో దోమ ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు లీటరు నీటికి రెండు మిల్లీలీటర్ల ఇథోపెన్‌ప్రాక్స్ మందును కలిపి పిచికారీ చేయాలి.

తుప్పు తెగులు

నేలలో జింక్ లోపం ఉన్నప్పుడు పంటను తుప్పు తెగులు ఆశిస్తుంది. నాట్లు వేసిన 2 నుంచి 6 వారాల్లో ఆకు చివరలో ఈనెకు ఇరుపక్కలా తుప్పులేక ఇటుక రంగు మచ్చలు ఏర్పడతాయి. మొక్కలు గిడసబారి దుబ్బు చేయవు. పైరుకు జింక్ లోపం కనిపించగానే జింక్ సల్ఫేట్ కలిపి ఐదు రోజుల వ్యవధిలో రెండు లేక మూడు సార్లు పిచికారీ చేయాలి.

పాముపొడ..

చేను దుబ్బు చేసే దశలో ఆకులపై మచ్చలు ఏర్పడి క్రమేణా పెద్దవై పాము పొడ మచ్చలుగా ఏర్పడతాయి. ఉధృతి ఎక్కువగా ఉంటే మొక్కలు చనిపోతాయి. దీని నివారణకు ఒక మిల్లీలీటరు ప్రొపికొనజోల్ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

అగ్గితెగులు

ఈ తెగులు సోకినప్పుడు ముదురు ఆకులపై నూలు కండె ఆకారంలో గోధుమ రంగు మచ్చలు ఏర్పడి ఆకులు ఎర్రబడతాయి. నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

కాండం కుళ్లుతో..

ఆకుతొడిమపై నల్లటి మచ్చలు ఏర్పడతాయి. లోపలి కాండానికి విస్తరించి కణుపులు మధ్య భాగమంతా నల్లగా మారిపోతుంది. గింజ పాలుపోసుకునే దశ నుంచి గట్టిపడే వరకూ ఈ తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. తాలు గింజలు ఏర్పడి 30 నుంచి 80 శాతం పంట నష్టపోయే అవకాశం ఉంటుంది. తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే లీటరు నీటికి 2 మిల్లీలీటర్ల థయాపానేట్ మందును కలిపి పిచికారీ చేయాలి.

ఆసుపత్రి అభివృద్ధికి రూ.13.85 కోట్లు

అనపర్తి: స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి అభివృద్ధికి రూ.13.85 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక ఆరోగ్య కేంద్రాల స్థాయి పెంపు చేయడంతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. ఇందులో భాగంగా అనపర్తి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల ఆసుపత్రిగా స్థాయి పెంచారన్నారు. 24 మంది ప్రత్యేక వైద్య నిపుణులు ఈ ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తారన్నారు. దీనికి అనుగుణంగా ఆసుపత్రి భవన నిర్మాణాలకు ప్రభుత్వం రూ.13.85 కోట్లు మంజూరు చేసిందని వివరించారు. నిధులతో ప్రస్తుతం ఉన్న ఆసుపత్రి భవనంపై భాగంలో ఒక అంతస్తు, ఆసుపత్రి వెనుక భాగంలో నాలుగు అంతస్తుల భవనాలకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈ పనులకు 25న శ్రీకారం చుడతామన్నారు. సీఎం జగన్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పాశాలమ్మ ఊరేగింపు

మధురపూడి: కాపవరం గ్రామదేవత పాశాలమ్మ వారి ఊరేగింపు శనివారం జరగనుంది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. ఈ నెల 14వ తేదీన ప్రారంభమైన జాతర మహోత్సవం ఆదివారం వరకూ నిర్వహించనున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చదువు చెప్పిన గురువులతో పూర్వ విద్యార్థులు

రాజానగరం: మండలంలోని నరేంద్రపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 20 ఏళ్ల క్రితం చదువుతున్న విద్యార్థులు (అప్పట్లో ప్రాథమికోన్నత పాఠశాల) శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించుకున్నారు. ఒకరినొకరు పలకరించుకుని, అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతులను నెమరువేసుకుంటూ రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. విద్యార్థి దశలోని ఆనందాన్ని పంచుకున్నారు. ప్రస్తుతం వారి స్థాయి, కుటుంబ సభ్యుల యోగక్షేమాలు గురించి పరస్పరం తెలుసుకున్నారు. పిల్లలతో సహా వచ్చిన వారంతా ఆడుతూ, పాడుతూ సందడి చేశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. భౌతికంగా లేని మిత్రులను, గురువులను స్మరించుకున్నారు.

అర్హులందరికీ నెలాఖరులోగా ఇళ్ల స్థలాలు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం



వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఈ నెలాఖరులోగా ఇళ్ల స్థలాల పట్టాలను అందిస్తామని, ఈ విషయంపై ఎవ్వరూ ఆందోళన చెందనవసరం లేదని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. వైఎస్సార్ సీపీ స్థానిక కార్యాలయంలో మండలంలోని కొండగుంటూరు, జి.యర్రంపాలెం గ్రామాలకు చెందిన పార్టీ నాయకులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఆయా గ్రామాలకు సంబంధించిన వివిధ విషయాలు, రాబోయే ఎన్నికలలో భారీ మెజార్టీతో విజయం సాధించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సుదీర్ఘంగా చర్చించారు. వర్గ, వైషమ్యాలను పక్కన పెట్టి, సమష్టిగా పనిచేయాలని సూచించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో గడచిన నాలుగున్నరేళ్లగా ప్రజలకు అందించిన వివిధ సంక్షేమ పథకాలు, చేకూరిన ప్రయోజనాలను వ్యక్తిగతంగా ప్రతి ఒక్కరినీ కలుసుకుని వివరించాలన్నారు. అదే సమయంలో గత చంద్రబాబు ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు, పింఛన్ల కోసం ప్రజలు పడిన పాట్లను, ఎదుర్కొన్న ఇబ్బందులను కూడా గుర్తు చేయాలన్నారు. పెండింగ్ పనులు ఏమైనా ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకువస్తే, వాటిని సత్వరమే పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చెప్పారు.

ప్రజల ఆరోగ్యమే సీఎం జగన్ లక్ష్యం



నల్లమిల్లిలో రోగులకు మందులు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

రంగంపేట: గ్రామీణ ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని, అందుకు అనుగుణంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అమలు చేస్తున్నారని సర్పంచ్ నల్లా పద్మ అన్నారు. నల్లమిల్లిలో పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, ఆరోగ్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరంలో డాక్టర్లు పి.సాయిప్రణీత్, పి.హవీల తదితరులు 461 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఈసీజీ, ల్యాబ్ పరీక్షలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు పి.రాంబాబు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ మట్టా శ్రీను, ఉప సర్పంచ్ కె.సాయిబాబు తదితరులు రోగులకు మందులు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు నల్లా దుర్గాప్రసాద్, పి.గౌరీశంకర్, ఎస్.చక్రరావు, సీహెచ్‌ఓ కె.జయమణి తదితరులు పాల్గొన్నారు.

రాపాకలో 452 మందికి వైద్యసేవలు



రాపాకలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ రాజు

సీతానగరం: మండలంలోని రాపాకలో సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ డాక్టర్ ఎస్.రాజు, డాక్టర్ ఏసురాణి, స్పెషలిస్టులు డాక్టర్ జీఆర్ చైతన్య, డాక్టర్ స్వాగత్ 452 మందికి వైద్య సేవలు అందించారు. పది మందికి ఈసీజీ, 316 మందికి ల్యాబ్ టెస్టులు చేశారు. 21 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అందరికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. రోగులకు అవసరమైన మందులను ప్రభుత్వం అందించిన బ్యాగ్‌లలో ఉంచి సర్పంచ్ గన్నిన బ్రహ్మజీ, ఎంపీటీసీ సుంకవల్లి వీర వెంకట సత్యనారాయణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బంగారు అప్పారావు, సచివాలయం కార్యదర్శి సురేష్, సీహెచ్‌వో వెంకటరత్నం, ఎంపీహెచ్‌ఈవో వైఎస్ రాయుడు, ఎంఎల్‌హెచ్‌పీ చిన్నారి, సూపర్ వైజర్ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్లు రూప్‌కుమార్, స్వామి, బి.శ్రీను, ఏఎన్‌ఎం రోజామణి పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పాటుపడిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. విజయవాడలో 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించిన సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక పాతవూరులో అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ భావితరాల భవిష్యత్తును నిర్దేశించే విధంగా ప్రపంచంలో అత్యున్నత రాజ్యాంగాన్ని దేశానికి అందించారని అన్నారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ అంసూరి సూర్యనారాయణ, సర్పంచ్ వారా కుమారి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి మురళీమోహన బాలకృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కొండేటి భీమేష్, ఏడుకొండలు, పంచాయితీ వార్డు సభ్యుడు కోటి, నాయకులు మండ శ్రీనివాసరెడ్డి, లంకలపల్లి త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో జగన్ పాలన



సీతానగరం నుంచి విజయవాడ వెళుతున్న నాయకులు



గాదాల నుంచి బయలుదేరుతున్న బస్సు

సీతానగరం: భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని పలువురు కొనియాడారు. విజయవాడలో శుక్రవారం జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు మండలంలోని పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దాల కొండలరావు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో సామాజిక సాధికారత ఒక నినాదం కాదని, అది రాష్ట్ర ప్రభుత్వ విధానం అన్నారు.

మధురపూడి: విజయవాడలో జరిగే అంబేడ్కర్ మహాశిల్పం ఆవిష్కరణ కార్యక్రమానికి కోరుకొండ మండలం నుంచి బడుగు, బలహీన వర్గాలు తరలివెళ్లాయి. నాలుగు బస్సుల్లో వివిధ గ్రామాల నుంచి పయనమయ్యారు.

ప్రగతి దిశగా పల్లెల పరుగులు

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



పైన గ్రామంలో కళావేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పల్లెలు ప్రగతి దిశగా పరుగులు పెడుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడి, పైన గ్రామాల్లో గ్రాసిమ్ ఇండస్ట్రీ సౌజన్యంతో నిర్మించిన కళావేదికలను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల్లో గ్రాసిమ్ ఇండస్ట్రీ కళా వేదికలు నిర్మించడం అభినందనీయమన్నారు. ఆయా గ్రామాల్లో దశల వారీగా అభివృద్ధి పనులు వేగంగా చేపడుతున్నామన్నారు. ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, పైన గ్రామ సర్పంచ్ సుందరపల్లి ప్రమీళ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు సుందరపల్లి సుధాకర్‌బాబు, సమ్ముంగి దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్లు మార్ని కామరాజు చౌదరి, సబ్బెళ్ల అమ్మిరెడ్డి, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి పప్పు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వర్క్‌షాప్‌లో అనపర్తి జెడ్పీటీసీ

అనపర్తి: తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో హెల్దీ విలేజ్ పేరిట జాతీయ స్థాయిలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో అనపర్తి జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, వెంకటరెడ్డి పాల్గొన్నారు. 20వ తేదీ వరకూ జరిగే ఈ వర్క్‌షాప్‌లో రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై క్షేత్రస్థాయి పరిశీలన, ప్రజలు మరింత ఆరోగ్యవంతులుగా ఉండేందుకు చేపట్టాల్సిన చర్యలు తదితర అంశాలపై చర్చ జరుగుతోంది. వైద్య సేవలపై ఆయా రాష్ట్రాల్లో అమలు చేస్తున్న విధి విధానాలను వివరించడంతోపాటు అధికారులు అవగాహన కల్పించినట్లు జెడ్పీటీసీ తెలిపారు. ఈ సదస్సులో కొమరిపాలెం సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్, కొంకుదురు ఎంపీటీసీ పీవీ పాల్గొన్నారు.

ఎస్‌బీఐ సేవలపై ప్రజలకు అవగాహన

మధురపూడి: భారతీయ స్టేట్ బ్యాంకు సేవలపై ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో గ్రామాల్లో కళాప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు కోరుకొండ బ్రాంచి మేనేజర్ బాబారామ్ భరత్ తెలిపారు. కోరుకొండ మండలం శ్రీరంగపట్నం, రాఘవపురం, దోసకాయలపల్లి, దేవీపట్నం మండలం ఇందుకూరుపేటల్లో శుక్రవారం కళాజాతాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భరత్ మాట్లాడుతూ ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నాబార్డు సౌజన్యంతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ప్రధాన మంత్రి సురక్ష పేరిట జనరల్ ఇన్సూరెన్స్, వ్యవసాయ రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక సహకారం, కోళ్లఫారాల ఏర్పాటుకు, గేదెల పెంపకానికి రుణాలందిస్తున్నట్లు తెలిపారు. అలాగే వినియోగదారులు సైబర్ నేరగాళ్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యూనో యాప్ వినియోగం, మార్కెటింగ్ స్కీములను వివరిస్తూ రాజమహేంద్రవరానికి చెందిన విభూతి బ్రదర్స్ కళాబృందం ప్రదర్శనలు చేసింది.

డ్రైనేజీ నిర్మాణం పూర్తి



మర్రిపూడిలో పూర్తయిన డ్రైనేజీ నిర్మాణం

రంగంపేట: మర్రిపూడిలో రూ.10 లక్షలతో చేపట్టిన డ్రైనేజీ నిర్మాణం పూర్తయ్యింది. దీనిని శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు వేము చిరంజీవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ప్రధాన రహదారి పక్కన డ్రైనేజీ లేక మురుగు పారక ప్రజలు ఇబ్బందులు పడేవారని, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చొరవతో రూ.10 లక్షల నిధులు మంజూరు కావడంతో నిర్మాణం పూర్తయ్యిందన్నారు. మురుగునీటి సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

సత్తెమ్మ జాతర చూతము రారండి

- నేటి నుంచి ఉత్సవాలు
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు



అమ్మవారి సన్నిధిలో ఉట్టిపై ఉంచిన కత్తి కుండ



కొప్పవరంలో కొలువుదీరిన సత్తెమ్మతల్లి అమ్మవారు

అనపర్తి: బిచ్చమెత్తడం ద్వారానే మొక్కులు తీర్చుకోవాలనే ఆచారం సాగుతున్న కొప్పవరం సత్తెమ్మ తల్లి జాతర 20 నుంచి 22వ తేదీ వరకూ జరగనుంది. కోటీశ్వరులైనా.. కూలివారైనా తమ కోరికలు నెరవేరగానే అమ్మవారికి మొక్కును చెల్లించడంలో భాగంగా జాతరలో విచిత్ర వేషధారణ వేయాల్సిందే.. జోలి పట్టాల్సిందే.. కర్రి వంశస్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న సత్తెమ్మ తల్లికి ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే జాతర సాధారణంగా జరిగే అన్ని జాతరలకు భిన్నంగా ఉంటోంది. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆలయ, పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. మూడు రోజుల పాటు జరుగనున్న జాతరను తిలకించేందుకు, మొక్కులు చెల్లించేందుకు వివిధ ప్రాంతాల్లో ఉన్న గ్రామస్తులు, భక్తులు ఇప్పటికే కొప్పవరం చేరుకున్నారు. గత జాతరలో భక్తులు పూజలు నిర్వహించి అమ్మవారి సన్నిధిలో ఉట్టిపై ఉంచిన కత్తి కుండను కిందకు దింపడం ద్వారా జాతరకు శ్రీకారం చుడతారు. సంతానం లేని దంపతులు ఈ కుండను శిరస్సున ధరిస్తే సంతానం కలుగుతుందని భక్తుల విశ్వాసం. దీంతో జాతర ప్రారంభమయ్యే రోజున సంతానం లేని మహిళలు ఉపవాస దీక్షతో కత్తి కుండను శిరస్సున ధరించేందుకు వేకువజాము నుంచే అమ్మవారి ఆలయంలోనే వేచి ఉంటారు. 20వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు కత్తి కుండను దించేందుకు ముహూర్తం నిర్ణయించారు. 21న ఉదయం 5 గంటలకు సత్తెమ్మతల్లికి ప్రతిరూపంగా కొలిచే నాగదేవత పుట్ట వద్దకు మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ గ్రామస్తులు, భక్తులు వెళ్లి పాలు పోస్తారు. జాతర చివరి రోజైన 22న ఉదయం 9 గంటలకు గ్రామంలో ఎక్కడ చూసిన కోలాహలం నెలకొంటుంది. మొక్కులు తీర్చుకోవడం కోసం విచిత్ర వేషధారణలతో బిచ్చమెత్తుకుని వచ్చిన సొమ్మును అమ్మవారికి సమర్పించుకోవడం తరతరాలుగా వస్తున్న ఆచారం. దీంతో వందలాది మంది భక్తులు విచిత్ర వేషాలు ధరించి చేసే యాచనతో గ్రామం అంతా హోరెత్తుతుంది. అమ్మ జాతరను పురస్కరించుకుని భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.